క్లుప్తంగా

రక్షణ మంత్రికి సత్కారం



రాజ్‌నాథ్ సింగ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఐఎన్ఎస్ డేగా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాజ్‌నాథ్‌ను కలిసిన తర్వాత శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు విశాఖ పర్యటనలో వున్న మంత్రి నారా లోకేష్‌ని కలిశారు.

ఎట్టకేలకు చెత్తకుండీల తరలింపు



చెత్తకుండీలు తొలగించడంతో ఖాళీగా వున్న ప్రదేశం

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ సమీపంలో నిరుపయోగంగా వున్న చెత్త కుండీలను ఎట్టకేలకు ప్రజారోగ్య విభాగం అధికారులు వేరేచోటకు తరలించారు. ఇక్కడి హాకర్స్ జోన్ సమీపంలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రెండు చెత్తకుండీలు నిరుపయోగంగా వుండడంపై 'సాక్షి'లో బుధవారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ రెండు చెత్త కుండీలను వేరేచోటకు తరలించడంపై స్థానిక వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

నవరాత్రి ఉత్సవాలకు రాట



అక్కయ్యపాలెంలో ఉత్సవ రాట వేస్తున్న నిర్వాహకులు, మహిళలు

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్‌టీ స్కూల్ కూడలి వద్ద న్యూ ఫ్రెండ్స్ సంపత్ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం ఉత్సవ కమిటీ నిర్వాహకులు, స్థానిక మహిళలు పూజలు చేసి రాట వేశారు. వినాయక చవితి నుంచి తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకుడు బసరమాని జగదీష్ తెలిపారు. 35వ సంవత్సరం ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మెడికవర్, శ్రీ నేత్ర ఐ కేర్, శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి హాస్పిటల్స్, సంధ్య డెంటల్ కేర్ హాస్పిటల్ సిబ్బంది ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 100 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. కొందరికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారని, ఉచితంగా ఆపరేషన్స్ చేసేందుకు ఆస్పత్రులు ముందుకొచ్చాయని ధ్యాన మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ఇదే ప్రాంగణంలో సంధ్య డెంటల్ కేర్ సిబ్బంది 60 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో డాక్టర్ జయసాయి చందు, డాక్టర్ కళ్యాణి, అభిరామ్, నీరజ, ప్రియాంక, డాక్టర్ రాజు, ప్రసాద్, డాక్టర్ రేష్మ, వై.శ్రీలత పాల్గొన్నారు.

తెరిపివ్వని వర్షంతో ఇక్కట్లు

- ఇంటికే పరిమితమైన నగరవాసులు
- విద్యార్థులు, ఉద్యోగులకు తప్పని అవస్థలు
- చెట్లు కూలడంతో రాకపోకలకు ఇబ్బందులు



సీతమ్మధార మెయిన్ రోడ్డులో వర్షంలో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు



సీతంపేట రాజేంద్రనగర్‌లో కూలిన చెట్టు

సీతంపేట : రోజంతా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో నగరం తడిసి ముద్దయింది. బుధవారం రాత్రి మొదలైన వర్షం గురువారం కూడా కొనసాగింది. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది. కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. ముఖ్యంగా స్కూల్‌కి వెళ్లే చిన్నారులు, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు వర్షంతో ఇబ్బంది పడ్డారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రెయిన్లు, గెడ్డల్లో వర్షపు నీరు పొంగి ప్రవహించింది. వర్షం, గాలులు కారణంగా 25వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్‌లో ఓ చెట్టు కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో రాకపోకలకు మార్గం లేకుండా పోయింది. చెట్టు తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. వర్షం నీటి తాకిడికి రోడ్లన్నీ వరద నీటితో జలమయమయ్యాయి. బిర్లా కూడలి జాతీయ రహదారిలో వర్షంలో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. బస్సు షెల్టర్లలో నిరీక్షించిన ప్రయాణికులు వర్షం ఒలిపిరికి తడిసి ముద్దయ్యారు. బస్సులు ఆపకపోవడంతో వారంతా ఇబ్బంది పడ్డారు.

రోడ్లన్నీ జలమయం

సీతమ్మధార : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం, క్రాంతి నగర్, గాంధీనగర్, రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, టీపీటీ కాలనీ రోడ్లు జలమయమయ్యాయి. అలాగే 14వ వార్డులోని బాలయ్య శాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, గణేష్‌నగర్, సీతమ్మధార, ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు నివాసాల ముందు వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్ల మీద చెట్ల కొమ్మలు పడి విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది. దీంతో ఈపీడీసీఎల్ సిబ్బంది సకాలంలో చేరుకుని మరమ్మతులు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మీద వున్న గోతులు వర్షాలకు కనిపించక వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్ల మీద వర్షపు నీరు నిలిచిపోవడంతో పాదచారులు ఇబ్బంది పడ్డారు. వర్షాల కారణంగా చిరు వ్యాపారులు ఉపాధి లేక అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్‌లు, రోడ్ల మీద వ్యాపారాలు చేసుకునే వారు దుకాణాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానం బురదమయంగా తయారైంది. వర్షపు నీరు మైదానంలో నిలిచిపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది అవస్థలు పడ్డారు.



వర్షంతో మేడపైకి ఒరిగిపోయిన చెట్టు

ఇంటిపైకి ఒరిగిపోయిన చెట్టు

మద్దిపాలెం : బుధవారం రాత్రి వీచిన గాలి, కురిసిన వర్షం కారణంగా జీవీఎంసీ 53వ వార్డు మద్దిపాలెం గ్రీన్‌గార్డెన్స్‌లో ఓ చెట్టు ఇంటిపైకి వాలిపోయింది. ఆ చెట్టు కిందకి పడిపోతుందేమోనని స్థానికులు గురువారం అటుగా రాకపోకలు సాగించలేదు. అప్పటి నుంచి రాత్రి వరకు జీవీఎంసీ అధికారులు కనీసం చెట్టును తొలగించే ప్రయత్నం కూడా చేయలేదని స్థానికులు మండిపడుతున్నారు.



బస్సు షెల్టర్ వద్ద వాహనాలు నిలిపి నిరీక్షిస్తున్న వాహన చోదకులు



వర్షాలకు జలమయమైన నక్కవానిపాలెం రోడ్డు



బురదమయంగా మారిన ఎన్ఎంసీహెచ్ స్కూలు మైదానం

మూడు గంటలపాటు అంధకారం



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అక్కయ్యపాలెం రోడ్డుపై అంధకారం

సీతంపేట : వర్షం కారణంగా విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. వర్షం, గాలులు కారణంగా చెట్ల కొమ్మలు విరిగి పడడంతో కంచరపాలెం ఫ్లైఓవర్ వద్ద విద్యుత్ వైర్లు కలిసిపోయి ట్రిప్ అవ్వడంతో సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లో పార్కు వద్ద, కేంద్రీయ విద్యాలయం వద్ద చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ రాజశేఖర్ పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధించారు. సుమారు మూడు గంటలపాటు అంధకారం నెలకొనడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

సరకులు సరఫరా టెండర్ ఖరారు



టెండర్ బాక్సు తాళాలు తీస్తున్న దేవస్థానం సిబ్బంది

సీతమ్మధార : స్థానిక నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల మహాగణపతి షిరిడీ సాయి దేవస్థానానికి కిరాణా సరకుల సరఫరా టెండర్ గురువారం ఖరారు చేశారు. దేవస్థానంలో కూరగాయల సరఫరా, కిరాణా సామగ్రి, పువ్వులు, పళ్ల రసాలు సరఫరా నిమిత్తం టెండర్లు పిలిచారు. టెండర్ల ప్రక్రియ పరిశీలనకు ప్రత్యేకాధికారిగా నియమితులైన రైల్వే న్యూకాలనీ దేవస్థానం ఈవో జగన్నాథరావు పర్యవేక్షణలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో టెండర్ బాక్స్ తెరిచి దరఖాస్తులు పరిశీలించారు. అయితే నాలుగు అంశాల్లో ఒకటైన కిరాణా సామగ్రి సరఫరాకి మాత్రమే ముగ్గురు కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. ఇందులో ఒకరి టెండర్ ఖరారు చేశారు. టెండర్ ఖరారైన కాంట్రాక్టర్ ఏడాదిపాటు సరకులు సరఫరా చేయాల్సి వుంటుందని ఈవో తెలిపారు. మిగిలినవి సరఫరా బాధ్యతలు ఎవరికైనా అప్పగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది శివ, వనజాక్షి పాల్గొన్నారు.

సంతకు శ్రావణశోభ



సంతలో విక్రయిస్తున్న పువ్వులు

మద్దిపాలెం : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు పూజకు అవసరమయ్యే సామగ్రి కొనుగోలు చేశారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవధార 48వ నంబరు లాస్ట్ బస్టాప్ వద్ద నిర్వహిస్తున్న సంతలో గురువారం అధిక సంఖ్యలో మహిళలు శ్రావణ శుక్రవారం పూజకు కావాల్సిన పువ్వులు, కొబ్బరికాయలు, కూరగాయలు కొనుగోలు చేశారు. ఈ ప్రాంతమంతా రద్దీగా కనిపించింది.

జంక్షన్ జామ్

ప్రమాదకరంగా బాలయ్య శాస్త్రి లే అవుట్ రోడ్డు



వాహనాలతో రద్దీగా బాలయ్య శాస్త్రి లే అవుట్ రోడ్డు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని పలు మార్గాల్లో వాహనాల రద్దీ కారణంగా నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్ నుంచి బాలయ్యశాస్త్రి లే అవుట్ సమీపంలో గల పోర్టు స్టేడియానికి వెళ్లే మార్గం వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. పోర్టు స్టేడియానికి వెళ్లే మార్గం సమీపంలో రోడ్డు పల్లంగా ఉండడం, సమీపంలో ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా అకస్మాత్తుగా వాహనాలు రావడంతో ఎదురుగా వచ్చే వారు సడెన్ బ్రేక్ వేయాల్సిన పరిస్థితి నెలకుంటోంది. ఈ మార్గంలో బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు ఎక్కువగా పాఠశాల బస్సులు మలుపు తిరుగుతుంటాయి. ఆ సమయంలో మిగిలిన మూడు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకుంటోంది. ముఖ్యంగా ప్రెసిడెన్సియల్ స్కూలు బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పల్లంగా ఉన్న కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు, పాదచారులు హడలిపోతున్నారు. ఇదే మార్గంలో యూ టర్న్‌లు రెండు వుండడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ద్వారకా పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పందించి జీవీఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ మార్గంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వాల్తేర్ డివిజన్ నుంచి 220 పోస్టుల సరెండర్ దారుణం

శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ రామమోహన్‌రావు



డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ నుంచి 220 పోస్టులను సరెండర్ చేస్తూ ఈస్ట్ కోస్ట్ రైల్వే యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని శ్రామిక్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన నేతృత్వంలో ప్రతినిధి బృందం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనేక విభాగాల్లో సుమారు 5 వేల ఖాళీలున్నాయని, తీవ్రమైన మానవ వనరుల కొరతతో రైల్వే కార్మికులు పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం వాల్తేర్ డివిజన్‌ను దేశంలో అగ్రగామిగా నిలుపుతున్నామని ఆయన తెలిపారు. ఈ సమయంలో ఉన్న పోస్టుల్లో 220 శాశ్వతంగా ఖుర్దారోడ్, సంబల్‌పూర్ డివిజన్‌కు సరెండర్ చేయడం అన్యాయమన్నారు. ఈ ప్రక్రియను ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఇది కూడా అశాస్త్రీయ పద్ధతిలో చేపట్టారని ఆరోపించారు. ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, తక్షణమే ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. వాల్తేర్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డీఆర్ఎంను కోరారు. ఉత్తర్వులు ఉపసంహరించుకోకుంటే కార్మికులతో కలిసి పోరాడుతామన్నారు. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు, ఎన్.ధనరాజు, బి.చక్రవర్తి తదితరులు డీఆర్ఎంను కలిశారు.

తెలుగు భాష మనందరి శ్వాస



మాట్లాడుతున్న కవి పెంటకోట రామారావు



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం సాయిలక్ష్మి



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్ : మాతృభాషను మర్చిపోతే తల్లిని మర్చిపోయినట్లేనని కవి పెంటకోట రామారావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. గ్రాంధిక భాషకు పరిమితమైన విద్యాభ్యాసం వాడుక భాషలోకి రావడానికి గిడుగు రామ్మూర్తి పంతులు కృషి చేశారన్నారు. సృజనాత్మక ఆలోచనలు మాతృభాషలోనే సాధ్యమవుతాయన్నారు. తెలుగు భాష మనందరి శ్వాస అన్నారు. అగ్రదేశాలు కూడా మాతృభాషకే అత్యంత ప్రాధాన్యమిస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో ఇతర భాషలపై మోజు పెరిగి తెలుగును మర్చిపోయే స్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ విజ్ఞానం సముపార్జన, ఉద్యోగావకాశాల కోసం ఇతర భాషలు నేర్చుకోవడం తప్పు కాదని చెప్పారు. తెలుగు వెలగాలంటే పిల్లలు నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- మురళీనగర్ పరిసరాల్లోని పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు నగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సాయిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు వ్యవహారిక భాషా వ్యాప్తికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలను తెలుగు భాషా పండితురాలు మీనాకుమారి వివరించారు. ధ్యాన్‌చంద్ జీవిత చరిత్రను పీడీ స్వరూపారాణి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వం, ఆటల పోటీల్లో విజేతలకు హెచ్ఎం సాయి లక్ష్మి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు ఎల్.కృష్ణారావు, త్రినాథ్, శ్రీను, రాజబాబు, నిర్మల, రమణమూర్తి, నరసింగరావు, కిరణ్, శ్రీధర్, కమల, ప్రశాంతి, పాల్గొన్నారు.

వెయ్యేళ్ల లిఖిత సాహిత్యం సొంతం

సీతంపేట: గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ అమ్మ భాష, అమృత భాష, దేశభాషలందు తెలుగు లెస్స అని తెలుగుభాష పేరొందిందని కొనియాడారు. వెయ్యేళ్ల లిఖిత సాహిత్యమున్న తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, కె.సోమేశ్వరరెడ్డి, దీపక్ చౌదరి, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీకాంత్, సురేఖ, పైడిరాజు, మాలతి, రవికుమార్ పాల్గొన్నారు.



బుల్లయ్య కళాశాలలో తెలుగు భాషా దినోత్సవంలో మధుకుమార్, తదితరులు

వాకర్స్ పార్కులో గిడుగు జయంతి

మురళీనగర్ : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష వ్యాప్తికి గిడుగు చేసిన సేవలు స్మరించుకున్నారు. తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేసి తెలుగుతల్లి రుణం తీర్చుకుందామని వక్తలు పిలుపునిచ్చారు.

తెలుగు భాష చరిత్ర, గిడుగు రామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు భాషోద్యమం వివరాలను అమరావతి విశ్వ సాహితి సమితి కార్యదర్శి సీహెచ్ సూర్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా నాటకకర్త, సాహితీవేత్త పాలమరశెట్టి ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు తెలుగు భాష తియ్యదనం, గొప్పదనాన్ని కవితల రూపంలో వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్బారావు అమరావతి విశ్వ సాహితి కోశాధికారి పి.యల్.వి.ప్రసాద్, కవులు ఆర్.రాములు, పి.నిర్మలరాజు, ఎ.సత్యనారాయణ, ఎన్.శ్రీనివాసరావు, ఆర్.రామలక్ష్మి, జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు సేవతోనే సంతృప్తి



పేదలకు చీరలు, దుప్పట్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కంచరపాలెం : పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని విజయ సాయి మెగా చారిటబుల్, కోన కుంచయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ప్రతినిధి జగదీశ్వరరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ తుమ్మడపాలెంలో విశాఖ జిల్లా యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు, గొల్ల కంచరపాలెం గ్రామ మాజీ అధ్యక్షుడు కోన కుంచయ్య మహాలక్ష్మమ్మ పేరిట గురువారం పేదలకు చీరలు, దుప్పట్లు ఆహార పొట్లాలు అప్పలరాజు, మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ కోన కుంచయ్య పేరిట 45 సంవత్సరాల నుంచి ట్రస్ట్ అనేక సేవ కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఇప్పటికే 110 మంది వృద్ధులు, అనాథలకు ఆశ్రయం కల్పించామన్నారు. అనంతరం సుమారు 120 మంది పేదలకు చీరలు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాయిత పైడి రత్నాకర్, ధనలక్ష్మి, కృష్ణ కల్యాణి, కోన బాబు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మైకేల్ జాక్సన్ పాటలకు నోటితో సంగీతం

నేడు కళాభారతిలో కార్యక్రమం

డాబాగార్డెన్స్: అంతర్జాతీయంగా సంగీత ప్రియులను ఉర్రూతలూగించిన మైకేల్ జాక్సన్ జయంతిని పురస్కరించుకుని ఆయన పాటలకు మిమిక్రీ కళాకారుడు డీటీఎస్ రమేష్ తన నోటితో సంగీత ప్రదర్శన ఇవ్వనున్నారు. విశాఖలో ఇంగ్లిష్ వెస్టన్ నైట్‌గా చూపించబోతున్న ఈ కార్యక్రమంలో మైకేల్ జాక్సన్ 10 పాటలకు రమేష్ సంగీతాన్ని అందించనున్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంగీత ప్రియులు, మైకేల్ జాక్సన్ అభిమానులను రమేష్ కోరారు. నోటి ద్వారా సంగీత ధ్వని అనుకరణతో జరిగే ఈ ప్రక్రియకు తానిచ్చిన పలు ప్రదర్శనల్లో విశేష ఆదరణ దక్కిందన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

సీతంపేట: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు ఆరోపించారు. పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, భద్రత పాటించని యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలని కోరుతూ వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెంలో గల కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఏఐఇఫ్టూ కార్యదర్శి గణేష్ పాండా మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికులు, అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మాకంపెనీలో రియాక్టర్ పేలి 17 మంది, పరవాడలోని సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇవి ప్రమాదాలు కావని, యాజమాన్యం చేసిన హత్యలని ఆరోపించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన 64 జీవోతో పరిశ్రమలలో తనిఖీలు చేయనవసరం లేదని, యాజమాన్యాలు సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని తెలిపారు. అప్పటి నుంచి పరిశ్రమల్లో తనిఖీలు జరగడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో పరిశ్రమలకు విచ్చలవిడిగా అనుమతులివ్వడం, చట్టాలను గాలికి వదిలేయడమే ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు. అనంతరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, ప్రకాష్‌రావు, చంద్రశేఖర్, శివ, ఏఐటీయూసీ నాయకులు వామనమూర్తి, బి.వెంకటరావు, సత్యాంజనేయ, సత్యనారాయణ, కాసుబాబు, ఇఫ్టూ నాయకులు మల్లన్న, తిరుపతిరావు, వెంకటరావు పాల్గొన్నారు.

జాతీయ సభలను జయప్రదం చేయండి

సీతమ్మధార: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల్లో భాగంగా సెప్టెంబర్ 3న విశాఖలో జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికుల మీద భారం మోపే 21, 31 జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ద్వారకానగర్ బుధిల్ పార్కు హోటల్ జంక్షన్ వద్ద గురువారం ఆటో డ్రైవర్ల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రవికృష్ణ, యు.శివాజీ, కె.దేవుడు, జి.మురళి, జె.ఎస్.మూర్తి, టి.రవి, జి.సతీష్, డి.దేవరాజు, ఈశ్వరరావు, రాజు, శ్రీను అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.